శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

డివిజన్ల వారీగా రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయండి:

కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 18, ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలక సంస్థ కు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, తాగు నీటి కుళాయి పన్నుల వసూళ్లను డివిజన్ల వారీగా వేగవంత చేయాలని కమిషనర్ సూర్య తేజ అధికారు లను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగాస్థానిక మూడవ డివిజన్ వెంగళ్ రెడ్డి నగర్ తదితర ప్రాంతాలలో కమిషనర్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా పన్నుల వసూళ్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులను జారీ చేయాలని సూచించారు. మొండి బకాయి దారులను, అనధికార కుళాయి కనెక్షన్లు కలిగిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనధికార భవన నిర్మాణాలు, అనుమతులు లేకుండా ఎలాంటి కట్టడాలు జరగకుండా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిరంతరం పర్యవేక్షించా లని, నిబంధనలు ఉల్లంఘించిన భవనాలకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. స్థానికంగా ఉన్న డ్రైన్ కాలువల నిర్మాణం, రోడ్ల మరమ్మత్తు పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న వీధి కుక్కలను గుర్తించి వాటికి వాక్సినేషన్ శస్త్ర చికిత్సలు చేయించి తిరిగి జనావాసాల్లోకి విడిచిపెట్టాలని, పశువులు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని, పందులు జనావాసాలలో తిరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లాలో ఆర్ఓబిలు, ఆర్యుబిల ప్రస్తుత స్థితి ఏంటి..?

నెల్లూరు రూరల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లాలో ప్రతిపాదిత 11 ఆర్ఓబిలు, ఆర్యుబిల ప్రస్తుత స్థితి ఏంటని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆరా తీశారు. బుధవారం లోక్‌సభలో ఈ మేరకు ఆయన ఆర్‌వోబిల స్థితిగతులపై పలు ప్రశ్నలు వేశారు. ఆర్వోబిలు ఎప్పటికి పూర్తవుతాయో తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ సమాధానమిచ్చారు. లెవెల్ క్రాసింగ్ లకు (ఎల్‌సిఎస్) బదులుగా రోడ్ ఓవర్ బ్రిడ్జిలు(ఆర్ఓబిలు)/రోడ్ అండర్ బ్రిడ్జిల (ఆర్‌యుబిలు) పనుల మంజూరు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. రైలు కార్యకలాపాలు, భద్రత, రైళ్ల కదలిక, రహదారి వినియోగం వంటి అనేక అంశాలపై ఆధారపడి ప్రాధాన్యత ప్రకారం కేటాయింపు జరుగుతుందన్నారు. దేశంలో 2004 - 14 మధ్య ఆర్ఓబిలు/ఆర్‌యుబిల సంఖ్య 4,148 కాగా, 2014-24 మధ్య కాలంలో 11,945 ఆర్ఓబిలు/ ఆర్‌యుబిలు ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు. 01.04.2024 నాటికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 7309 కోట్ల వ్యయంతో 248 మంజూరు చేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. దేశంలో మొత్తం 92,692 కోట్ల వ్యయంతో 4200 ఆర్ఓబిలు /ఆర్‌యుబిలు మంజూరు చేయబడ్డాయని చెప్పారు. ఇక ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో 12 ఆర్ఓబిలు/ ఆర్‌యుబిల పనులు మంజూరయ్యాయని, వాటి పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలియజేశారు. ఆర్ఓబి/ఆర్‌యుబి పనులను పూర్తి చేయడం, ప్రారంభించడం అనేది లెవెల్ క్రాసింగ్ మూసివేతలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం, అప్రోచ్ అలైన్మెంట్ ఫిక్సింగ్, జనరల్ అరేంజ్ మెంట్ డ్రాయింగ్ (జిఏడి) ఆమోదం వంటి వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుందన్నారు. భూసేకరణ, ఆక్రమణల తొలగింపు, ఉల్లంఘించిన యుటిలిటీలను మార్చడం, వివిధ అధికారుల నుంచి చట్టబద్ధమైన అనుమతులు, ప్రాజెక్ట్ / వర్క్ సైట్ల ప్రాంతంలో శాంతిభద్రతల పరిస్థితి, వాతావరణ పరిస్థితులు వంటి అంశాలన్నీ ప్రాజెక్టుల పూర్తి సమయాన్ని ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు.

ఉచిత హెచ్ఎల్ప వైద్య పరీక్షలు

నెల్లూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త -వైద్యం తల సేమియా బాధిత చిన్నా రులకు రూ.25 లక్షలకు పైగా ఖర్చు అయ్యే బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటే షన్ చికిత్సలను చేయించేందుకు ఉచితంగా హెచ్ఎల్ప వైద్య పరీక్షలను మద్రాస్ బస్టాండ్ సమీపంలో ఉన్న నెల్లూరు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంకల్ప్ ఫౌండేషన్ మేనేజర్ అభిజిత్, వైద్యులు మోహన్ హాజరయ్యారు. రెడ్ క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయా లన్న సంకల్పంతో జిల్లాలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 13 ప్రాజెక్టులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో తలసేమియా ప్రాజెక్టు కూడా ఒకటని, ఈ ప్రాజెక్టు ద్వారా తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి, సేవలలో భాగంగా ఏడాదికి 1500 యూనిట్ల రక్తాన్ని రెడ్ క్రాస్ ఉచితంగా అందిస్తుందన్నారు. అయితే తలసేమియా బాధిత చిన్నారులు వారి వైకల్యాన్ని అధిగమించి అందరూ చిన్నారుల్లా సాధారణ జీవితం గడపాలనే ఉద్దేశంతో సంకల్ప ఫౌండేషన్ సహకారంతో రెడ్ క్రాస్ ద్వారా వారికి రూ.25 నుంచి రూ.40 లక్షల రూపాయలు ఖర్చయ్యే బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను ఉచితంగా చేయిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు ఎనిమిది మంది చిన్నారులకు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను విజయవంతంగా చేశామన్నారు. మరో 15 మంది చిన్నారులకు ఈ బోన్ మ్యారో చికిత్స అందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని పర్వతరెడ్డి వెల్లడించారు. తాజాగా ఇందులో సంబంధించి మరో 17 మందికి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స అందించేందుకు సంకల్ప్ ఫౌండేషన్ వారి నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు బోన్ మ్యారో చికిత్సలు అందించేందుకు వైద్యులు సీత, కో కన్వీనర్ పర్వీన్ ఎంతో సహాయ సహకారాలు అందిస్తున్నారని వివరించారు. త్వరలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 20 పడకల తలసేమియా క్లీనిక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి మరింత ఎక్కువ మందికి ఈ బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంటేషన్ చికిత్స చేయించడం జరుగుతుందన్నారు. అనంతరం వచ్చినటువంటి తలసేమియా చిన్నారులకు వారి తల్లిదండ్రులకు మహా యాగ హెల్పింగ్ సొసైటీ వారు భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు .ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, డాకారపు రవి ప్రకాష్, రెడ్ క్రాస్ ట్రెజరర్ సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు నేతాజీ సుబ్బారెడ్డి, దాసరి రాజేంద్ర ప్రసాద్, వాకాటి విజయ కుమార్‌రెడ్డి, తలసేమియా కన్వీనర్ డాక్టర్ సీత, అడ్వైజర్ డాక్టర్ హరిత, కోకన్వీనర్‌లు ఎస్‌కే పర్వీన్, ఎన్.బలరామయ్య నాయుడు, సెక్రటరీ పి.మస్తానయ్య, రెడ్ క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెలికం అడ్వైజరీ కమిటీకి ఆమోదం

ఎంపీ వేమిరెడ్డి సిఫార్సులకు ఓకే చెప్పిన కేంద్ర మంత్రి

నెల్లూరు రూరల్, డిసెంబర్ 18, ప్రభాత వార్త నెల్లూరు జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీకి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలి పింది. ఈ మేరకు కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖమంత్రి జ్యోతిరాధిత్య సిండియా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాస్థాయిలో టెలికం అడ్వైజరీ కమిటీ ఏర్పాటుకు వివిధ నియోజకవర్గాల నుంచి పలువురి పేర్లను నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ఈ సిఫార్సులకు కేంద్ర మంత్రి ఆమోదం తెలుపుతూ సంబంధిత ఉత్తర్వులు జారీ చేశారు. టెలికం అడ్వైజరీ కమిటీకి ఎంపీ వేమిరెడ్డి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. జిల్లా టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఆత్మకూరు నియోజకవర్గం మర్రిపాడు మండలానికి చెందిన కటారి రమణయ్య, కందుకూరు నియోజకవర్గం వలేటివారిపాలేనికి చెందిన గుర్రం మాల్యాద్రి, నెల్లూరు రూరల్, శ్రీహరి నగర్‌కు చెందిన బొప్పూరు ప్రసాద్, కావలి నియోజకవర్గానికి చెందిన కుట్టుబోయిన బ్రహ్మానందం, నెల్లూరు సిటీకి చెందిన ఏటూరి రమేష్‌బాబు,కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేటకు చెందిన ముంగర గోపాల్, ఉదయగిరి నియోజకవర్గం కొండాపురం మండలానికి చెందిన తాటికొండ అనూష, నెల్లూరు రూర ల్‌కు చెందిన వేదనపర్తి సురేంద్ర రెడ్డి ఎంపికయ్యారు. టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ఎన్నికవడంపై సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీ సహకారంతో జిల్లాలో టెలికం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, డిసెంబర్18, ప్రభాతవార్త: మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 3570 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 72.7టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 600, పెన్నా డెల్టాకు 1550, కండలేరు వరద కాలువకు1200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.856మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

నెల్లూరు జిల్లాలో రహదారుల అభివృద్ధికి సహకరించండి

నితిన్ గడ్కరీకి ఎంపీ వేమిరెడ్డి వినతి



నెల్లూరు రూరల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయండి. దుత్తలూరు కావలి రోడ్డు పనుల్లో వేగం పెరిగేలా అధికారులను ఆదేశించండి, రాజుపాలెం నుంచి రామాయపట్నం పోర్టు వరకు రహదారిని అభివృద్ధజ చేయండి ఎంపీ వేమిరెడ్డి వినతులపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కావలి బైపాస్ రోడ్డుకు, దుత్తలూరు కావలి రోడ్ల పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నెల్లూరు జిల్లాలో రహదారుల అభివృద్ధే ధ్యేయంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. జిల్లాలో రహదారులకు సంబంధించి పలు అంశాలను కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని వినతి సమర్పించారు. ఎంపీ వేమిరెడ్డి వినతులపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి రహదారుల అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. కావలి పట్టణం పశ్చిమం వైపు బైపాస్ ఏర్పాటు చేయండి. కావలి నియోజకవర్గం కావలి మండలంలో 2 లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారన్నారు. సమీప మండలాల్లో మరో 3 లక్షల జనాభా నివసిస్తున్నారని ఎంపీ వేమిరెడ్డి కేంద్రమంత్రికి వివరించారు. ప్రజలు తమ వివిధ అవసరాల నిమిత్తం కావలి పట్టణానికి వస్తుంటారని, దాంతో పాటు కావలి టౌన్ గుండా భారీ వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయన్నారు. దాంతో టౌన్‌లో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో స్థానిక ప్రజలు, టౌన్‌కు వచ్చే సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎన్‌హెచ్ 16 నుండి కావలి దుత్తలూరు రహదారిని (ఎన్‌హెచ్167 బిజి వద్ద) అనుసంధానిస్తూ కావలి టౌన్‌కి పశ్చిమాన ఒక బైపాస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ వేమిరెడ్డి వినతిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. కావలి టౌన్ పశ్చిమాన బైపాస్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కావలి దుత్తలూరు రోడ్డు పనులు వేగవంతం చేయండి. అలాగే దుత్తలూరు (ఎన్‌హెచ్167 బిజి జంక్షన్ వద్ద) నుండి కావలి వద్ద ఎన్‌హెచ్ - 16లో కలిపేలా నిర్మిస్తున్న రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్‌హెచ్ 167 బిజికి 101 కి.మీ పశ్చిమం వైపున కావలి పట్టణం ఎంట్రన్స్ నుండి ఎన్‌హెచ్167 బిజిలో కొనసాగుతున్న పనిలో డ్రైన్ నుండి డ్రెయిన్ వరకు తప్పనిసరిగా సిసి పేవర్ వేయించాలని కోరారు. దీనివల్ల ప్రజలకు అసౌకర్యం తగ్గి ప్రమాదాలు నివారించే వీలుంటుందని వివరించారు. కాబట్టి రహదారి పనులను వేగవంతం చేసేలా సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డ్రెయిన్ టు డ్రెయిన్ వరకు సిసి పేవర్‌ను అందించే పనిని మంజూరు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి తప్పకుండా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. రామాయపట్నం పోర్టుకు రహదారిని విస్తరించండి. జిల్లాలో రాజుపాలెం నుంచి అల్లూరు మీదుగా రామాయపట్నం ఓడరేవు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ మీదుగా విబీ వరకు ఉన్న ఆర్‌అండ్‌బి రహదారిని ఎన్‌హెచ్ వరకు సిఆర్ఐఎఫ్ కింద అప్‌గ్రేడ్ చేయాలని కేంద్రమంత్రికి ఎంపీ వేమిరెడ్డి విన్నవించారు. ఈ రహదారి ఏర్పడితే రామాయపట్నం ఓడరేవు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నుంచి ఎన్‌హెచ్16 కి లాజిస్టిక్ ఎగుమతులు సులభతరం అవుతాయని వివరించారు. అలాగే జిల్లా తీరప్రాంత గ్రామాలలో నివసించే మత్స్యకారులకు రవాణా సౌకర్యం మెరుగుపడి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయమై స్పందించిన కేంద్రమంత్రి. రహదారి విస్తరణపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు విజయవంతం

నెల్లూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలు విజయవంతంగా పూర్తి అయ్యాయని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని సంతపేటలో ఉన్న రామనారాయణరెడ్డి క్యాంపు కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల విజయవంతంపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికైన సభ్యులందరై ఐక్యమత్యంగా వ్యవసాయ పనులకు సాగునీటిని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో 3649 సాగునీటి సంఘాలకు నోటీఫికేషన్ ఇవ్వగా3553 సంఘాలకు ఎన్నికలు పూర్తయ్యాయని మంత్రి ఆనం అన్నారు. మిగిలిన ఖాళీలను కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో నామినేటెడ్ చేస్తామని చెప్పారు. ఈ నెల 21న ప్రాజెక్టు కమిటీలకు కూడా అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. సాగునీటి సంఘాలు ఎన్నికలపై ప్రతిపక్షం ఆరోపణలు అర్థరహితమని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో సాగునీటి సంఘాలు ఎన్నికలు నిర్వహించే ధైర్యం చేయలేదని మంత్రి ఆరోపించారు. రైతుల పట్ల వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ నిర్వీర్యం చేసిందని ఆనం ధ్వజమెత్తాడు. ఈ ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వ సమర్థ పాలనాదక్షతకు నిదర్శనమన్నారు. ఐదేళ్ల సుధీర్ఘ ప్రయాణం తర్వాత రైతుల భూములు పచ్చతోరణంతో కళకళలాడనున్నాయని అనందాన్ని వ్యక్తం చేశాడు. రైతల చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని వెల్లడించారు. తమ ప్రభుత్వానికి అండగా నిలిచిన అన్నదాతలకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

నెల్లూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం పేద ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు సంయుక్తంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కోరారు. బుధవారం నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత నూతనంగా ఎంపికైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మడపర్తి శ్రీనివాసులు, వీరబ్రహ్మారెడ్డి, య్యద్ అబీదా సుల్తానా, దార్ల మల్లిఖార్జున్, మొగరాల సురేష్ తదితరులను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశం తర్వాత ఆరోగ్యశ్రీ విభాగంలో మెరుగైన ఫలితాలు సాధించామన్నారు. ఇందుకు కృషి చేసిన వైద్యులు,ఇతర సిబ్బందికి తన అభినందనలన్నారు. ఇదే స్ఫూర్తితో ఇతర అన్ని విభాగాల్లో మెరుగైన ఫలితాలు సాధించి, అంతిమంగా ప్రజలకు అత్యున్నత వైద్యసేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా పరిపాలనాపరమైన లోపాలను సరిదిద్దుకోకపోతే ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అనుమతులిచ్చిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాల అధిపతులు పరస్పర అవగాహనతో ఆయా విభాగాల అవసరాల గురించి ప్రాధాన్యతా క్రమంలో జాబితా తయారు చేయాలన్నారు. అప్పుడే అనుమతులు ఇచ్చేందుకు కమిటీకు అవకాశం ఉంటుందన్నారు. ఫిజియోథెరపీ విభాగంలో అవసరమైన పరికరాలు, ఇతర సేవల గురించి వెంకటాచలంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ కాంపొజిట్ రీజనల్ సెంటర్(సీఆర్‌సీ) తో సంప్రదించాలన్నారు. అదేవిధంగా ఓపీ విభాగంలో రోగి ఆసుపత్రికి వచ్చినప్పటి నుండి తిరిగి ఆరోగ్యంగా వెళ్లునంత వరకు ప్రతి పక్రియను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఈ హాస్టపల్ ను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇందుకు అవసరమైన మైక్రో ప్లానింగ్‌ను వెంటనే తయారు చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్ పక్రియ పూర్తియితే రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. దాని ద్వారా ఆయుష్మాన్ భారత్ అభా ఐడీ రిజిస్ట్రేషన్‌లను పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏసీఎస్ఆర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీవీ రాజమన్నార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్ నాథ్, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ విభాగాధిపతులు డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్ భాషా, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

కావలి అభివృద్ధికోసం పరితపించిన గ్రంధి

ప్రజాసేవలోనే చివరివరకు నడిచిన మహానాయకుడు
కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి

కావలి, డిసెంబర్18 ప్రభాతవార్త కావలి అభివృద్ధికోసం పరితపించిన మంచి నాయకుడు, మాజీ మున్సిపల్ ఛైర్మన్, మాజీ ఏఎంసి ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టి అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కొనియాడారు. కావలి ముసునూరులోని టిడిపి కార్యాలయంలో గ్రంధి ప్రథమవర్ధంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గ్రంధి చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జీవితాంతం చివరివరకు ప్రజాసేవలోనే గడిపిన మహోన్నతవ్యక్తి గ్రంధి యానాదిశెట్టి అన్నారు. కావలి అభివృద్ధికోసం చేసిన కృషిని కావలి ప్రజలు ఎన్నడూ మరువరని తెలిపారు. ఏ సమస్యకోసం ఎవరొచ్చినా తన ద్విచక్రవాహనంపై తీసుకువెళ్లి పనిచేయించిన వ్యక్తి గ్రంధి అన్నారు. తెలుగుదేశంపార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడిగా ఆయన ఆ పదవికి వన్నెతెచ్చారన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్‌గా, ఏఎంసి ఛైర్మన్‌గా ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఆయన మృతి కావలికి తీరనిలోటు అన్నారు. తనకు అత్యంత ఆప్తుడు, ఎంతో ముఖ్యుడు గ్రంధి యానాదిశెట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్ర కార్యదర్శి మాజీ ఏఎంసి ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రముఖన్యాయవాది పోట్లూరు శ్రీనివాసులు, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ తటవర్తి వాసు, ఏరియా వైద్యశాల అడ్వయిజింగ్ కమిటీ డైరక్టర్ చవల రామకృష్ణ, మాజీ ఏఎంసి డైరక్టర్ తిరివీధి ప్రసాద్, బిజెపి కావలి నియోజకవర్గ కన్వీనర్ సివిసి సత్యం, ఆర్యవైశ్య కావలి మండల అధ్యక్షుడు తటవర్తి రమేష్, టిడిపి నేతలు వాయిగండ్ల వెంకటేశ్వర్లు, బుర్లా ప్రసాదరెడ్డి, వెంకట్రావు, కుదవసంఘం అధ్యక్షుడు తోట రమేష్, ఇడిముక్కల పవన్‌కుమార్, గురుస్వామి, తదితర నేతలు పాల్గొని నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

పూనే ల్యాబ్ రిపోర్ట్ తర్వాతే వ్యాధి నిర్ధారణ

మర్రిపాడు,డిసెంబర్18,ప్రభాతవార్త: ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా మర్రిపాడు మండలం వెంకటపురం గ్రామంలో ఓఆరేళ్ళ బాలుడికి జీకా వైరస్ లక్షణాలున్నాయన్న అనుమానంతో తాము తమ వైద్య బృందంతో వచ్చామని రాష్ట్రమలేరియా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామనాథ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలుడి బ్లడ్ శాంపిల్స్‌ను పూనే ల్యాబ్‌కు పంపామని , అక్కడ నిర్ధారణ అయితే కానీ జీకావైరస్ అని చెప్పలేమన్నారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి మెరుగ్గానే ఉందని, చెన్నైలో చికిత్స పొందుతున్నాడన్నారు. గ్రామం లో 150ఇళ్ళు ఉన్నాయని, ప్రతి కుటుంబానికి అవగాహనకల్పిస్తున్నా మన్నారు. జ్వరాల బారినపడిన ప్రతి ఒక్కరికి రక్తపరిక్షలు నిర్వహిస్తామని, అపోహలు, వదంతులు నమ్మవద్దన్నారు.డబ్ల్యుహెచ్ఒ మౌనిక, జిల్లా వైద్య బృందం పాల్గొన్నారు.

జీకా వైరస్ పై స్పందించిన 'ఆనం' వెంకటాపురం గ్రామంలో ఆరేళ్ళబాలునికి జీకా వైరస్ సోకిందన్న సమాచారంతో రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి, ఆత్మకూరు శాసనసభ్యులు ఆనంరామనారాయణరెడ్డి తక్షణమే స్పందించారు. జిజిహెచ్ వైద్యులతో పాటు వెంకటాపురానికి ప్రత్యేక వైద్యబృందాలను పంపామన్నారు.జీకా వైరస్ సోకిన బాలుని నివాసంతోపాటు గ్రామస్తులందరికీ వైద్యపరిక్షలు నిర్వహించమని గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయమని జిల్లా వైద్యశాఖను ఆదేశించారు. బాలుడి ఆరోగ్యంపై ఎప్పటికప్పుడుసమాచారం సేకరించి బాలుడిని రక్షించేం దుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఆయన వైద్యాధికారులను ఆదేశించారు.

ప్రణాళికాబద్ధంగా పనులు సాగాలి

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన డ్వామా , ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సంవత్సరానికి సంబంధించిన చేపట్టనున్న పనులకు ముందుగా ఒక ప్రణాళిక తయారు చేసుకుని ఆ పనులకు సంబంధించిన ఫోటోలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ పథకం కింద పనిచేసేందుకు కూలీలు ఉత్సాహంగా ఉంటే వారికి జాబ్‌కార్డులు ఇప్పించి ఉపాధి కూలీ శాతాన్ని పెంచేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీవో సుబ్బారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉంటే సమాచారం ఇవ్వాలి

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : కోవూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎక్కడైనా గ్రామాల్లో అనధికారికంగా మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తే గ్రామస్తులు ఎవరైనా తగు సమాచారాన్ని అందజేయాలని ఎక్సైజ్ సీఐ కిషోర్ అన్నారు. కోవూరులోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎక్కడా కూడా అనధికారికంగా మద్యం బెల్ట్ షాపు ఉండటానికి వీలు లేదన్నారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఈ బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే తగు సమాచారాన్ని అందజేస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. 9440707018 అనే నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఇప్పటివరకు సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల్లో 25 మద్యం బెల్ట్ షాపులను సీజ్ చేసి 52 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఒక మోటార్ సైకిల్‌ను కూడా సీజ్ చేయడం జరిగిందన్నారు. ఇటీవల జరిగిన లోక్ అదాలత్ లో తమ ఎక్సైజ్ శాఖకు సంబంధించి 56 కేసులను పరిష్కరించేలా చర్యలు తీసుకుని ప్రభుత్వానికి 3,73,860 రూపాయలు కాంపౌండ్ ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకున్నామన్నారు. అక్రమంగా మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తే అటువంటి వారు జైలుకు వెళ్లడం తప్పదన్నారు.

ఒంటరితనం భరించలేక యువకుడు ఆత్మహత్య

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : బీహార్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు కూలీ పనులు చేసేందుకు స్థానిక జాతీయ రహదారిలోని లాజిస్టిక్స్‌లో పనిచేసేందుకు బీహార్ నుంచి లక్ష్మణ్ నోనియా ఇటీవల వచ్చాడు. కొంతకాలం సక్రమంగా పనిచేసుకుంటూ ఇటీవల కాలికి దెబ్బతగలడంతో కొంత అనారోగ్యానికి గురయ్యాడు, ఈ నేపథ్యంలో ఇంటిపై బెంగ పెట్టుకుని ఒంటరితనాన్ని భరించలేక బుధవారం తెల్లవారుజామున లాజిస్టిక్స్ ప్రాంతంలో ఉన్న ఒక రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పక్కనే ఉన్న కూలీలు లక్ష్మణ్ నోనియాను హుటాహుటిన అంబులెన్స్‌లో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. ఈ లోగా అతను మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని ఖాదర్‌బాషా, హెడ్ కానిస్టేబుల్ రషీద్‌లు పరిశీలించి అక్కడ ఉన్న కూలీలతో లక్ష్మణ్ నోనియా ఆత్మహత్యపై పూర్తి వివరాలను సేకరించారు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిశుభ్రతపై దృష్టి పెట్టని పంచాయతీ పాలకవర్గం

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాలు గత రోజులుగా అపారిశుధ్యంగా దుర్గంధభరితంగా ఉన్నా సర్పంచ్ గానీ, పాలకవర్గం గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలకు చేరుకుని స్వచ్ఛందంగా వారే పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసేలా దృష్టి సారించారు. ఈ సందర్భంగా పూలమొక్కలు తెప్పించి పాఠశాల పరిసరాల్లో నాటేలా పూర్వ విద్యార్థులు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకున్న గ్రామ సర్పంచ్‌లు పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై దృష్టి సారించకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఒక వైపు ప్రభుత్వం పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలు ఇస్తున్నా.. గ్రామ పంచాయతీలో మాత్రం ఇసుమంతైనా స్పందన ఉండడం లేదన్నారు. ఇప్పటికైనా వారు స్పందించి గ్రామాలు స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు దృష్టి పెట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కమిటీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

20న గంగవరంలో పశు వైద్యశిబిరం

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : కోవూరు మండలం గంగవరం గ్రామంలో ఈ నెల 20వ తేది శుక్రవారం పశు సంవర్ధక శాఖసహకారంతో ఎస్సీ సబ్ ప్లాన్ కింద ఎస్సీ పాడి రైతులకు పశు వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. కోవూరులోని పశు వైద్యశాల కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పశు వైద్య శిబిరాన్ని గంగవరం గ్రామంలోని ఎస్సీ పాడి రైతులు వచ్చి పూర్తిస్థాయిలో దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరానికి పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులతో పాటు పశువైద్యులు కూడా పాల్గొంటారని, వారిచ్చే సలహాలు, సూచనలు పాడి రైతులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు.

భూసార పరిక్షల ద్వారా అధిక దిగుబడులు

ఏపూరు(రాపూరు),డిసెంబరు18ప్రభాతవార్త : రైతులు పంటలు లేని సమయంలో వారి భూములలో భూసార పరిక్షలు నిర్వహించుకోవడం ద్వారా దాని పలితాల ఆధారంగా ఎరువులు వాడటం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పోందవచ్చని రాపూరు మండల వ్యవసాయాధికారి పి.సోమసుందర్ తెలిపారు. మండలంలోని ఏపూరు గ్రామంలో బుదవారం పోలంపిలుస్తోంది కార్యక్రమంలో బాగంగా ఆయన రైతులకు వ్యవసాయానికి సంబం దించి పలు సూచనలు ఆందజేశారు. సేంద్రియ ఎరువులు వాడనందున పోలం జీవం కోల్పోయి క్రమేణా పంట ఉత్పాదక శక్తి క్షీణిస్తుందని, ఇందువల్ల రసాయినిక ఎరువుల మోతాదు పెంచవలసి వస్తుంద ్నారు .కాలక్రమేణాసూక్ష్మ పోషకాల లోపాలు ఆధికమవుతుందన్నారు. ఇందువల్ల దిగుబడి తగ్గి ఖర్చు ఆధికమైపోతుందని తెలిపారు. నెల్లూరులోని జీవ నియంత్రణ ప్రయోగశాల,ప్రాంతియ వ్యవసాయ పరిశోధనా స్థానం తిరుపతిలలో లభించే జీవన ఎరువులు వాడుకోని రసాయినాల ఎరువుల మోతాదు 25 శాతం వరకు తగ్గించుకోవాలన్నారు. సమగ్ర పోషక యాజమాన్యంలో బాగంగా సూక్ష్మ పోషకాలప్రాముఖ్యతను వివరిస్తూ రసాయిన ఎరువల వాడకం ద్వారా జరిగే అనర్థాలను రైతులకు వివరించారు. అధిక మోతాదులో రసాయన ఎరువల వాడటం ద్వారాభూభౌతిక స్థితి దెబ్బతిని నేలలో సారం క్షీణిస్తుందని,తద్వారా భూమిలో భాస్వరంనిల్వలు పెరిగిపోయి మొక్కల్లో సూక్ష్మ పోషక లోపాలు కనిపిస్తున్నాయన్నారు.కాంప్లెక్స్ ఎరువుల్లోని భాస్వరం మొక్కలకు 20 శాతం అందితే మిగిలిన 80 శాతం భూమిలో పెరుకుపోతుందని ఈ భాస్వరం నిల్వలను ఇలాగే భూమిలో వదలడం ద్వారా పంటల మనుగడ ప్రశ్నార్థకంగా మరే అవకాశం వుందని చెప్పారు.అందువల్ల రైతులు తప్పని సరిగా జీవ ఎరువులు వాడీ వారీ భూములలో సారం పెంచుకోవాలని చూసించారు. ఈ కార్యక్రమంలో వి.ఎ.ఎ. డి.తిరుమల తేజ,పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసిలో ప్రయాణమే ప్రయాణికులకు భద్రత

రాపూరు,డిసెంబరు18ప్రభాతవార్త : ప్రయాణికులకు ఆర్టీసిలో ప్రయాణమే భద్రత కూడి వుంటుందని రాపూరు ఆర్టీసి డియం అనీల్ కుమార్ తెలిపారు.బుదవారం డిపోలో గూడూరు వెంకటగిరి రూట్‌లలో అమలు చేస్తున్న గిఫ్ట్ స్కీం పథకంలో భాగంగా లక్కీ డీప్ డ్రా తీసారు.ఈ డ్రాలో విజేతలుగా గూడూరు రూట్‌లో పి.సర్మజ్ఞ, సి.హెచ్. చరణ్, వెంకటగిరి రూట్‌లో ఏ.రమణా రెడ్డి, సి.సంపూర్ణమ్మలు ఎంపిక కాగా వారికి డియం అనీల్ కుమార్ బహుమతులను బస్టాండ్‌లో ఆందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో నిష్ఠాతులైన డ్రైవర్లు ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతారని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసి అనేక రాయితీలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులకు ఉచిత ప్రయాణం, రాయితీ ప్రయాణం,సీనియర్ సిటిజన్‌లకు 25 శాతం రాయితీ ప్రయాణం వంటి అనేకసౌకర్యాలు అందజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు ఆర్టీసిని ఆదరించి లాబాల భాటలో నడపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.ఐ,ఎ.యం.ఏప్,డిసి (ఇ), తదితరులున్నారు.

వర్గీకరణ అమలుకై జరిగే పోరాటంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

వింజమూరు,డిసెంబర్18,ప్రభాతవార్త:ఎస్సీ వర్గీకరణ అమలుకై జరిగే పోరాటంలో ప్రతి మాదిగ విద్యార్థి ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఎంఎస్‌పి జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు మాదిగ పేర్కొన్నారు. బుధవారం వింజమూరులోని ఆర్ అండ్‌బి అతిథిగృహంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నియోజకవర్గ స్థాయి సమావేశం ఎంఎస్‌పి సీనియర్ నాయకులు జి.ఆనంద్‌మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకై 30సంవత్సరాల నుండి అలుపెరుగని పోరాటం చేసి చేసి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మందకృష్ణ మాదిగ పోరాటానికి నిదర్శనమన్నారు. అలాంటి నాయకుడి నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందని ఎస్సీ వర్గీకరణపై మాలల్లో కొంతమంది చేస్తున్న కుట్రలను మాదిగలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మాలలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నిజమైన వారసులయితే ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడవద్దు లేదంటే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామస్థాయిలో ప్రతి మాదిగ ఉద్యమంలో భాగస్వామి కావాలని, మంద కృష్ణమాదిగ నెల్లూరుజిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా మాదిగలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఉదయగిరి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు ఇన్‌చార్జ్‌లను నియమించారు. కలిగిరి మండలం నందిపోగు వెంగళరావ్, ఇన్‌చార్జ్‌గా బుర్రా వెంగళ్‌రావ్, శామ్యూల్, వింజమూరు మండలం జి.ఆనందరావ్, మల్లెల తిరుమలేశు,మందా సుజాత, గోసాల సుధాకర్, కొండాపురం మండలం తాటిపర్తిరాజా, గోసాల సుధాకర్, జలదంకి మండలం పందిటి అంబేద్కర్ మాదిగ, చెరుకూరు వెంకటేష్ మాదిగలను నియమించారు.ఈకార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ, వై.రమణయ్య, పి.రాజేంద్ర, జి.వెంగళరావ్, రాకేష్, రాజశేఖర్, మధు, రాఘవేంద్ర, కిషోర్, వెంగళరావ్, కొండలరావ్‌లు పాల్గొన్నారు.

చెరువు పనులను పరిశీలించిన కేంద్ర బృందం

వింజమూరు,డిసెంబర్18,ప్రభాతవార్త: వింజమూరు మండలంలో ఐఆర్ఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ , ఎఫ్‌సిఐ జాయింట్ సెక్రటరీ సచీంద్రకుమార్ పట్నాయక్ మండలంలో జరుగుతున్న జనశక్తి అభియాన్ పనులను తన బృందంతో కలిసి పరిశీలించారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రూప్‌టాప్ వాటర్ ఆర్‌వేస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూప్‌టాప్‌వాటర్ తో నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. గత పర్యటనలో నిర్మించి ఉన్న వాటర్ ట్యాంక్‌లను పరిశీలించగా ప్రస్తుతం వాటర్ లెవల్ పెరిగాయన్నారు. దాంతో చుట్టుప్రక్కల బోర్‌వెల్స్‌లో నీటి సాంద్రత పెరిగిందని దాంతో రైతులు మోటర్లతో పంటలు పండించుకుంటున్నా రన్నారు. అనంతరం చాకలికొండ గ్రామకొలను, చెక్‌డ్యామ్, జామతోటలను పరిశీలించారు. పిడి గంగాభవాని మాట్లాడుతూ హార్టికల్చర్ రైతులు నియోజకవర్గంలో ఉపాది హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడంతో జామతోటలు, పండ్ల తోటలను సాగుచేశారన్నారు. పండ్లతోటల వలన రైతులకు సంవత్సరానికి లక్షరూపాయల వరకు ఆదాయం వస్తుందన్నారు. పల్లె పండుగల్లో భాగంగా మినీ గోకులాలు మంజూరైన లబ్ధిదారులు డిసెంబర్ నెలాఖరులోపు పూర్తిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో గ్రౌండ్‌వాటర్ సీనియర్ సైంటిస్ట్ డి.లక్ష్మీనారాయణ, ఎపిడి శంకర్‌నారాయణ, గాయత్రీదేవి, ఎంపిడిఒ శ్రీనివాసులురెడ్డి, లోకేష్, శ్రీనివాసులు, ఎపిఒ , ఇసి, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కోసం సుబ్రహ్మణ్యం విద్యాసంస్థలు



వింజమూరు,డిసెంబర్18,ప్రభాతవార్త: జిల్లాలోనే అత్యంత వెనుకబడిన మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఈప్రాంత విద్యార్థుల భవిష్యత్తుకోసం వింజమూరులో శ్రీ సుబ్రహ్మణ్యం విద్యాసంస్థను ఏర్పాటు చేసి ఎంసెట్, నవోదయ శిక్షణనిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న అకాడమీ డైరెక్టర్ బద్దిక సురేంద్ర అభినందనీయుడని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను డైరెక్టర్ సురేంద్ర కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి తమ సంస్థ విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఇదేవిధంగా ఈప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజుతో మరింత మంది విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకెళ్ళమని ఎమ్మెల్యే సూచించారు. విద్యావిధానంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, విద్యార్థుల పట్ల జాగ్రత్తలు వహిసూ సంస్థను నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, నాయకులు ద్రోణాదుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రీ సర్వేలో జరుగుతన్న పొరపాట్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ, సర్వే అధికారులు

ఇందుకూరుపేట, డిసెంబర్ 18, ప్రభాతవార్త: ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో భూముల రీ సర్వే మీద బుధవారం గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా టీడీపీ నాయకుడు కొండా వెంకయ్య మాట్లాడుతూ రీ సర్వేలో గ్రామ సచివాలయ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు తప్పిదాలు విపరీతంగా పెరుగుతున్నాయని, క్రింది స్థాయిలో ఈ అధికారులు విపరీతంగా అవినీతికి పాల్పడుతున్నట్లుగా గ్రామంలో ఉండే రైతులు చెప్తున్నారు. భూ సమస్యల మీద వస్తున్న రైతుల నుండి రీ సర్వే పేరుతో రికార్డులు తారుమారు చేస్తూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలుస్తుంది. రైతులు భూ సమస్య మీద వెళ్తే గ్రామ సర్వేయర్, వీఆర్వో, మండల సర్వేయర్ సమాధానం చెప్పకపోగా రైతులను, ప్రజలను దుర్భాషలాడుతూ తరిమేస్తున్నారు. సర్వే నెంబరు 220-1లో ఎ 1.08 సెంట్లు చింతపంటి ఓబయ్య అనే పేరుతో రైతు భూమి ఉంటే రికార్డు తారు మారు చేసి సంబంధం లేని వ్యక్తుల పేర్లు రికార్డులోకి ఎక్కించి ఉన్నారు. పట్టాదారుణ్ణి ఆఫీసుల చుట్టు తిప్పుకుంటూ రాక్షస ఆనందం పొందుతున్నారు. రీ సర్వే పేరుతో ప్రజలను మోసగిస్తూ అవినీతి సొమ్ముని వెనుక వేసుకుంటున్నారు. ప్రజలు ప్రశ్నిస్తే బెదిరించే స్థాయికి సర్వేయర్, వీఆర్వో తయారయ్యారు. దీని మీద ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గ్రామ స్థాయి నుండి మండల పరిధిలో జరుగుతున్న ఈ అవినీతి మీద విచారణ జరిపి, ఎంక్వైయిరి చేసి రీ సర్వే పేరుతో గ్రామ సర్వేయర్, వీఆర్వో, మండల సర్వేయర్ చేస్తున్న మోసాలపై తగిన చర్యలు తీసుకుంటారని కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, మస్తాన్‌రెడ్డి, శివ, రామయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

ఆదిఆంధ్రపాలెంలో పాలం పిలుస్తోంది

ఉలవపాడు, డిసెంబర్ 18, ప్రభాతవార్త : ఉలవపాడు మండలంలోని ఆదిఆంధ్రపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.అనసూయ, మండల వ్యవసాయాధికారి బి.తిరుమలజ్యోతిలు రైతుల పంట పొలాలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. వరిలో ఆకు ముడత, ఎండు తెగులు నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్‌కే షరీపుద్దిన్, రైతులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ ఎక్సపో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్ఫూర్తి ఫార్మర్ ప్రొడ్యూషర్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ వై.బాలచంద్ర

ఉలవపాడు, డిసెంబర్ 18, ప్రభాతవార్త : విజయవాడ మెరీస్ స్టేల్లా వ్యవసాయ కళాశాలలో హార్టికల్చర్ ఎక్సపో కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఉలవపాడు రైతు స్ఫూర్తి ఫార్మర్ ప్రొడ్యూషర్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ వై. బాల చంద్రను ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా బాలచంద్ర మాట్లాడుతూ విద్యార్థులకు వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు అధునాతన విధానాలను విద్యార్థి దశ నుండి పరిష్కార మార్గాలను కనిపెట్టి రైతులను ముందుకు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మీటింగ్‌లో విజయవాడలోని ఆంధ్ర లయోలా కళాశాల జీఎంజీ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆ పంటలకు వ్యాల్యుఎడిషన్ చేయుట ద్వారా నిల్వ సామర్థ్యం పెంచి అధిక ధరలు వచ్చేలా ఎలా చేయాలో విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జెసింత్ క్వడ్రస్, హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ డాక్టర్ లక్ష్మణస్వామి సమునతి అగ్రి రిలేషన్ షిప్ శీలం మల్లిఖార్జునరావు, యువ పారిశ్రామిక వేత్త వైఎస్ చరణ్ పాల్గొన్నారు.

అక్క రాజు వారికండ్రిగ లో భూకబ్జా దారుల నుండి భూములకు విముక్తి కలిగించండి

బిట్రగుంట డిసెంబర్ 18 ప్రభాతవార్త: బోగోలు మండలం బోగోలు మేజర్ పంచాయ తీలోని అక్క రాజు వారి కండ్రికలో కొన్ని సర్వే నెంబర్లలో దాదాపు 100 సంవత్సరాల నుంచి ఇనాం భూములు, మేత పరంబోకు, అటవీ భూముల్లో జీవనాధారం సాగిస్తున్న రైతుల పొట్టలు కొట్టి కొంతమంది బోగస్ సర్వే నెంబర్లతో పొలాలు దున్ని స్వాధీనం చేసుకుంటున్నారని అక్కరాజువారి కండ్రిక గ్రామస్తులు ఆరోపించారు. మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం వారు ధర్నా నిర్వహించారు. గతంలో పనిచేసిన రెవిన్యూ అధికారుల ప్రమేయంతో రికార్డులను తారు మారు చేసి సర్వే వివిధ భిన్నాలతో తమకు హక్కులు ఉన్నాయని బోగస్ రికార్డులు చూపించి మేత పురంబోకు, ఇనాం భూములు, అటవీ భూములు విచ్చలవిడిగా జేసీబీ లతో దున్ని స్వాధీన పరుచుకుంటున్నారు అని ఆరోపించారు. దీనిపై తరచూ తాము అడ్డుకొని, మండల తాసిల్దార్ నుండి జిల్లా కలెక్టర్ వరకు, ఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తాము ధర్నాకు దిగామని హెచ్చరించారు. ఇప్పటికైనా స్పందించి రికార్డుల పరంగా పాత అడంగల్ నుండి ఎవరు స్వాధీనంలో ఈ సర్వే నంబర్లు ఉన్నాయో పరిశీలించి న్యాయం చేయాలని, లేనిపక్షంలో ప్రతిసారి వారు దున్నకానికి వచ్చినప్పుడు మేము అడ్డుకుంటున్నామని దీనివల్ల శాంతి భద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఆరోపించారు ఆందోళన చేసే వారిపైన అక్రమకేసులు పెడతామని బెదిరింపులుకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా ఈ సర్వే నంబర్లలో కనపడే వారి రికార్డుల పరిశీలించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం గ్రామస్తులు మండల డిప్యూటీ తాసిల్దార్ భరత్ కు తమ వినతి పత్రాన్ని అందజేశారు.

చెంచులక్ష్మీపురం లో పారిశుధ్య కార్యక్రమాలు

బిట్రగుంట డిసెంబర్ 18 ప్రభాతవార్త: బోగోలు గ్రామపంచాయతీ పరిధిలోని చెంచులక్ష్మీపురం ఏరియాలో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా మండలం విస్తరణ అధికారి షేక్ నయూమ్ తాజ్ హసన్ ఆధ్వర్యంలో బుధవారం అన్ని వీధులను శుభ్రంగా చిమ్మించి, చెత్తను ఎత్తి క్రిమిసంహారక మందులైన బ్లీచింగ్ ను పంచాయతీ వారు పిచికారి చేయడమైనది. ఈ కార్యక్రమంలో పరిశుభ్రత గురించి ప్రతి ఇంటి వారికీ వివరించారు. ఆరోగ్య కరమైన వాతావరణం ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి బోగోలు గ్రామ టీడీపీ ఇంచార్జి చిలకపాటి వెంకటేశ్వర్లు , స్థానిక నాయకులు ప్రభాకర్, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, స్థానికులు హాజరైనారు.

రెవెన్యూ సదస్సులకు అద్భుత స్పందన

జలదంకి,డిశంబర్18,ప్రభాతవార్త ః భూసమస్యల పరిష్కారానికి చేపట్టిన రెవెన్యూ సదస్సులకు అద్భుత స్పందన కనిపిస్తుందని ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ పేర్కొన్నారు.బుధవారం జలదంకిలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని పరిశీలించాడు.ఇప్పటివరకు మండలంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులు రైతులనుంచి అందిన వినతులు వంటివి తహసిల్‌దార్ ప్రమీలను అడిగి తెలుసుకున్నారు.వచ్చిన అర్జీలపై దృష్టిపెట్టి పరిష్కార మార్గాలను వేగవంతంగ చూడాలని సూసించారు.రైతులతో మాట్లాడారు.వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు రైతాంగ కడగండ్లను దృష్టిలో పెట్టుకొని ఈమహత్తర కార్యక్రమానికి శ్రీకారంచుట్టారని అన్నారు.ఫలితాలు కూడ ఆశించినంతగ రాబోతున్నాయన్నారు.రెవెన్యూ యంత్రాంగం అంతా దీనిపైనే ఫోకస్‌పెట్టి పనిచేస్తారన్నారు.భవిషత్‌లో సమస్యలు తలెత్తకుండ తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.అనంతరం గ్రామంలో పలు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు.పంచాయతీలో పారిశుద్యం,వీధిలైట్లు,నీటి సమస్యలు లేకుండ తగు చర్యలు తీసుకోవాలని పంచాయతి కార్యదర్శిని ఆదేశించారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట మండల మాజీ ఉపాధ్యక్షుడు తల్లపనేని మధుసూదన్,మాజీ రైతుసంఘ అధ్యక్షుడు కొల్లా రాధాకృష్ణ,పంచాయతి ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి,నేతలు గంటా అశోక్,ఏగూరి రఘు,జనసేన నాయకుడునిమ్మలపల్లి రామచైతన్య,బిజెపి నేతలు వడ్డే శ్రీనాద్‌రెడ్డి,చల్లా హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన

ఉలవపాడు, డిసెంబర్ 18, ప్రభాతవార్త : విద్యుత్ పొదుపుపై ప్రజలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ ఏఈ పువ్వాడి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఉలవపాడు మండలం వీరేపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్లో జాతీయ ఇంధన పొదుపు వార

డ్రైనేజి సమస్య పరిష్కరించమంటు చైర్‌పర్సన్‌కి వినతి

బుచ్చి డిసెంబర్ 18 ప్రభాతవార్త : బుచ్చి రెడ్డిపాళెం నగర పంచాయితీలోని 4 వవార్డు నారాయణ స్కూల్ వెనుక వైపు ప్రైడ్ డ్రీమ్ అపార్ట్‌మెంట్ పక్కన డ్రైనేజి సమస్య ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీని కలిసి రమేష్‌రెడ్డి,శ్రీదర్‌రెడ్డి ,మస్తాన్, విజయ్, వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ స్పందించి ఈ విషయాన్ని కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు.

గిరిజనులకు చెంతకు బ్యాంకు సేవలు

దుత్తలూరు,డిసెంబర్ 18,ప్రభాతవార్త : మండలంలోని నర్రవాడ గ్రామంలోని శ్రీ వెంగమాంబ గిరిజన కాలనీ వాసులకు బ్యాంకు అకౌంట్ లు లేకపోవడంతో వారికి బ్యాంకు సేవలు అందడంలేదని బిజెపి నాయకుడు మేకపాటి మాల్యాద్రి నాయుడు నర్రవాడ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మి దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆమె వెంటనే ఆ గిరిజనుల వివరాలు సేకరించి బ్యాంకు అకౌంట్ లను ఓపెన్ చెయించి, అకౌంట్ బుక్ ,ఎటిఎం లను బుధవారం ఆ గిరిజ నులకు అందజేశారు.ఈ సందర్భంగా మేనేజర్ నాగలక్ష్మి ఆ గిరిజన మహిళలకు బ్యాంకు అందించే సేవలను వివరించారు. అలాగే ఆ గిరిజనుల మహిళలను పొదుపు సంఘంలో చేర్చుటకు వెంటనే సీసీ ప్రభావతి సమావేశాన్ని నిర్వహించి ,పొదుపు సంఘాల్లో భాగస్వామ్యులను చేశారు.ఈ కార్యక్రమములో ఫీల్డ్ ఆఫీసర్ రాయుడు,బిజెపి నేత వెంకటేష్,పావులూరి వెంగయ్య,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధికి కుట్టుమిషన్లు ఎంతో ఉపయోగం

కావలి ఒన్‌టౌన్ ఎస్ఐ జమాల్‌ఖాన్

కావలి, డిసెంబర్18 ప్రభాతవార్త : మహిళల జీవనోపాధికి కుట్టుమిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని కావలి ఒన్‌టౌన్ ఎస్ఐ జమాల్‌ఖాన్ తెలిపారు. కావలి పట్టణంలోని శ్రీసాయి చారిటబుల్‌ట్రస్ట్ ఛైర్మన్ పొన్నగంటి మాధవి ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తిచేసుకున్న మహిళకు కుట్టుమిషన్ బుధవారం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ శ్రీసాయి చారిట బుల్ ట్రస్ట్ ఉచితంగా కుట్టుశిక్షణ ఇస్తూ కుట్టు మిషన్లు అందచేయడం పొన్నగంటి మాధవి చేస్తున్న సేవ ఎంతైనా అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఈ ట్రస్ట్ ద్వారా మహిళలకు మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు దాతలు సహకరించాలన్నారు. సంస్థ వ్యవస్థాపకురాలు పొన్నగంటి మాధవి మాట్లాడుతూ గత 6 సంవత్సరాలుగా దాదాపు వెయ్యిమందికి ఉచితంగా శిక్షణ ఇవ్వడమేకాక దాదాపు 500 మందికి పలువురి సౌజన్యంతో కుట్టుమిషన్లు అందచేయడం జరిగిందని తెలిపారు. ప్రవాస భారతీయులు కన్నేగంటి చంద్ర వారి సతీమణి మంజుల సహకారంతో ఈ కుట్టుమిషన్ అందచేశారన్నారు. ఈ కార్యక్రమంలో కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలు బీసీ ఐక్యతాభవన్ ప్రధానకార్యదర్శి వరప్రసాద్, ట్రస్ట్ బాధ్యులు కమల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినీయోగం చేసుకొండి.

వరికుంటపాడు,డిసెంబర్ 18,ప్రభాతవార్త : మండలంలో జరుగుతున్న రెవిన్యూ సదస్సు లను రైతులు,ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని డిప్యూటి తహశీల్దార్ చెంచయ్య అన్నారు .బుధవారం మండలంలోని రామాపురం,దక్కునూరు గ్రామాల్లో రెవిన్యూ సదస్సులను నిర్వహించి రైతుల నుండి అర్జీలు స్వీకరించారు.తమకు ఎలాంటి భూ ములు లేవని ప్రభుత్వం భూములను అందించాలని,వెబ్ ల్యాండ్ లో నమోదు చేయాలని కొరారు.ఈ సందర్భంగా డిప్యూటి తహశీల్దార్ చెంచయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యలను తీర్చేందుకు రెవిన్యూ సదస్సులను నిర్వహి స్తున్నారన్నారు.రైతులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. సీనియర్ సహాయకులు శ్రీనివాసులు, విఆర్ఓలు మహేష్,నారాయణ,మనోహర్,సర్వేయర్ లు ,రైతులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జడ్పీ డిప్యూటీ సిఇఒ

అనుమసముద్రంపేట,డిసెంబర్18,ప్రభాతవార్త: మండలంలోని ఎంపిడిఒ కార్యాలయాన్ని బుధవారం జిల్లాపరిషత్ ఉపముఖ్య కార్యని ర్వాహణాధికారి మోహన్‌రావ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రకాల రిజిస్టర్లను , సిబ్బంది పనితీరును పరిశీలించారు. మండల పరిషత్‌లో నిర్వహిస్తున్న 36 రిజిస్టర్లు గురించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. సమస్యలతో వచ్చిన ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసన్నకుమారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు, అధికారులకు రెండురోజులశిక్షణా తరగతులు ప్రారంభం

అనుమసముద్రంపేట,డిసెంబర్18,ప్రభాతవార్త: మండలంలోని పంచాయతీ సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి మండల పరిషత్ కార్యాలయంలో రెండురోజుల శిక్షణా కార్యక్రామన్ని ప్రారంభి ంచారు. ఈకార్యక్ర మా న్ని జడ్పీ డిప్యూటీ సిఇఒ మోహన్‌రావ్ బుధవారం ప్రారంభించారు. భారత జాతిపిత మహాత్మగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు పేదరిక నిర్మూలన, అందరికి ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు , పరిసరాల శుభ్రత , సుస్థిరమైన నగరాల రూపకల్పన, సామాజిక న్యాయం, లింగసమానత్వం తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. సుస్థిర అభివృది ్ధ లక్ష్యాలను గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు , సచివాలయ సిబ్బంది కృషిచేయాలన్నారు. 2047స్వర్ణ పంచాయతీ సాధనలో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి స్థానిక ప్రభుత్వాలు, ఉద్యోగులు కలిసి పనిచేసి పేదరికం లేని సమాజం , అందరికి జీవనోపాధులు గల గ్రామాలుగా , ఆరోగ్యకరమైన గ్రామాలుగా స్వచ్ఛమైన తాగునీరు, క్లీన్‌అండ్‌గ్రీన్ గ్రామాలుగా రూపొందించడంలో స్థానిక ప్రభుత్వాలు కృషి చేయాలని ఎంపిపి బి.పద్మజారెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య శిక్షకులుగా ఎంపిడిఒ ప్రసన్నకుమారి, విస్తరణాధికారి రమేష్, వెలుగు ఎపిఎం సతీష్,ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు కస్తూరి,విజయలక్ష్మి,పంచాయతీరాజ్‌ఎఇఖాదర్‌మ స్తాన్‌లు వ్యవహరించారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు,సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా బిజెపి బ్రహ్మానందం

కావలి, డిసెంబర్18 ప్రభాతవార్త : శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులుగా బిజెపి కావలి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందాన్ని నియమించారు. బుధవారం ఈ మేరకు బ్రహ్మానందంకు సమాచారం అందచేశారు. టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా బ్రహ్మానందం నియమింపబడడంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

డైలీ కార్మికులను ఆప్కాస్‌లో నియమించాలి

కావలి, డిసెంబర్18 ప్రభాతవార్త కావలి పట్టణంలో పారిశుధ్యపనులు చేస్తున్న దినసరి కూలీలను ఆప్కాస్‌లో చేర్చాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. బుధవారం కావలి ఆర్డీఓ వంశీకృష్ణను కలిసి సిఐటియు నేతలు వినతిపత్రం అందచేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎర్రంశెట్టి కృష్ణమోహన్ మాట్లాడారు. పట్టణంలో సుమారు 5 సంవత్సరాలనుండి డైలీ కార్మికులుగా పారిశుధ్యపనులు చేస్తున్నారన్నారు. వీరి జీతాలు చాలాతక్కువ అని చెప్పారు. తక్కువ జీతాలతో ఎక్కువపనులు చేయిస్తున్నారని దీంతో వారి కుటుంబాలు గడవడంలేదని తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను కూడా తెగించి పారిశుధ్యపనులు చేసి ప్రజారోగ్యానికి పాటుపడ్డవారిని ఆప్కాస్‌లో చేర్చకపోవడం చాలా అన్యాయమన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో 40 ఖాళీలు ఉన్నట్లు సమాచారమన్నారు. ఈ ఖాళీలలో పనులు చేస్తున్నవారిని నియమించకుండా అధికారపార్టీ అండతో కొత్తవారిని ఆప్కాస్‌లో చేర్చాలని మున్సిపల్ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇది చాలా దుర్మార్గమన్నారు. 60 సంవత్సరాలు పేరుతో కొంతమందిని పనులనుంచి నిలిపివేశారని వారిస్థానంలో వారి కుటుంబసభ్యుల్లో ఒకరిని నియమించలేదని ఆయన తెలిపారు. ఇప్పటికైనా పనులు చేస్తున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అలా జరగనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరికలు చేశారు. సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

మిరపలో కింద ముడత నివారణపై అవగాహన

సైదాపురం, డిసెంబర్ 18, ప్రభాతవార్త : మండలంలోని చాగణం గ్రామంలో ఉన్న రైతు సేవ కేంద్రంలో మండల వ్యవసాయ శాఖాధికారిణి హైమావతి బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు పండిస్తున్న మిరప పంట, నిమ్మ తోటలను ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మిరపలో కింద ముడత (తెల్లనల్లి) నివారణపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అవగాహన కల్పించారు. వ్యాధి మొదటి దశలో నీటిలో కరిగే గంధకం 20 లీటర్ల నీటికి 60 గ్రాములు కలిపి పిచికారి చేయాలన్నారు. వ్యాధి ఉధృతి మధ్య నుండి ఎక్కువగా ఉంటే స్పైరోమెసిఫైన్ 29.9 శాతం ఎస్‌సీ 20 లీటర్ల నీటికి 20 ఎంఎల్ లేదా క్లోరోఫినాపైర్ 10శాతం ఎస్‌సీ అనే మందు 20 లీటర్ల నీటికి 40 ఎంఎల్ కలిపి పిచికారి చేయాలన్నారు. వీటితో పాటు వేపనూనె 1500 పీపీఎం అయితే 40 ఎంఎల్ 20 లీటర్ల నీటికి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చాగణం నీటి సంఘం అధ్యక్షుడు కందాటి దయాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో వినతులు

సైదాపురం, డిసెంబర్ 18, ప్రభాతవార్త : మండలంలోని తుమ్మ లతలుపూరు గ్రామ సచివాలయంలో బుధవారం అధికారులు రెవెన్యూ సద స్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఈగ రమాదేవి భూ సమస్యలపై అర్జీలను రైతుల వద్ద నుండి స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తుమ్మలతలుపూరు గ్రామంలో భూ సమస్యలపై రైతుల వద్ద నుండి 28 అర్జీలను స్వీకరించడం జరిగిందని, ఎక్కవగా అసైన్డ్‌మెంట్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని రైతులు వినతులు ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పెమ్మసాని దిలీప్‌చౌదరి, గ్రామ సర్పంచ్ ఆవుల హరిత, ఎంపీటీసీ సభ్యులు శేషమ్మ, సర్వేయర్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరిలో ముగిసిన శిక్షణ తరగతులు

ఉదయగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఉదయగిరి పట్టణంలోని స్థానిక శ్రీ శక్తి భవనంలో పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై జరుగుతున్న శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ శిక్షణలో ఎంపీడీఓ అప్పాజీ పాల్గొని మాట్లాడుతూ సుస్థిర లక్ష్యాలు సాధనకు శిక్షణలో నేర్చుకున్న అంశా లను అమలుపరచాలన్నారు. గ్రామా లు ఆర్థికంగా అభివృద్ధి చెందినందుకు బలోపేతం చేసేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొ ందించుకోవాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ నడుం బిగించి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, సీఓలు, ఏపీఎం కాజా రహంతుల్లా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జలదంకిలో బైక్‌చోరి

జలదంకి,డిశంబర్18,ప్రభాతవార్త ః మండల కేంద్రమైన జలదంకిలో బైక్‌చోరికి గురైంది.స్థానిక ఉత్తరపు వీధిలో నివాసముంటున్న బొమ్మారెడ్డి సత్యన్నారాయణరెడ్డికి చెందిన బైక్ తన నివాసంముందు రోజుమాదిరె మంగళవారం పార్కింగ్ చేశాడు.అయితే బుధవారం లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు.చుట్టుప్రక్కల వెదికి అందరిని వాకాబుచేసిన ప్రయోజనం లేకపోయింది.చోరికి గురైందని గ్రహించి జలదంకి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.గ్రామంలో నివాసాలవద్ద బైక్‌ను ఎత్తుకు పోవడం గ్రామంలో చర్చనియాం శమైంది .పోలీసులు విచారించి తగున్యాయం చేయాలని బాదితుడు సత్యన్నారాయణరెడ్డి విజ్ఞప్తిచేశాడు.

ప్రేరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త : ఉదయగిరి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే ప్రేరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ తోట శ్రీనివాసులు కోరారు. బుధవారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ఆయా సబ్జెక్టులలో ఉపాధ్యాయులు లేనట్లయితే తమకు తెలియజేయాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యత ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలి

ఉదయగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త : సమాజంలో ప్రజలు ఆర్థిక అక్షరాస్యతను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని వెలుగు ఏపీఎం కాజా రహమతుల్లా తెలిపారు. బుధవారం ఉదయగిరిలోని స్థానిక శ్రీశక్తి భవనంలో జరిగిన సమావేశంలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకుల్లో అమలు చేసే ప్రభుత్వ పథకాలను ఇన్సూరెన్స్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆధార్ కార్డు లేని వారు సచివాలయంలో సంప్రదించాలి

ఉదయగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త : ఉదయగిరి మండలంలో ఇప్పటి వరకు ఆధార్ కార్డు లేని వారు వారి పరిధిలోని గ్రామ సచివాలయంలో సంప్రదించి సచివాలయం సిబ్బందికి తమ సమాచారాన్ని అందించానలి ఎంపీడీఓ అప్పాజీ బుధవారం విలేకర్లకు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలతో ఇతర వర్గాల వారికి ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేసుకుని ప్రత్యేక శిబిరాల ద్వారా ఆధార్ కార్డులు కొత్తగా అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కండలేరులో 55.656 టీయంసీల నిటిమట్టం

కండలేరుడ్యాం(రాపూరు),డిసెంబరు18ప్రభాతవార్త: మండలంలోని కండలేరు జళాశయంలో బుదవారం ఉదయానికి 55.656 టీయంసీల నిటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల.కండలేరు వరద కాలువ ద్వారా 1100 క్యూసెక్కులు,వరదనీటి రూపేణా 500 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1600 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా జళాశయంలోకి వస్తుండగా అవుట్‌ఫ్లోగా జళాశయం హెడ్ రెగ్యులేటర్ నుండి 920 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 10 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 160 క్యూసెక్కులు,రాపూరు మండల నీటి అవసరాల కోసం 5 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1095 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

ప్రోటోకాల్ పక్కాగా పాటించాం

– డిఆర్ఓ ఉదయ భాస్కర్

నెల్లూరు అర్బన్, డిసెంబర్ 18, ప్రభాతవార్త : జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు ఎన్ ఎండి ఫరూక్ రాక సందర్భంగా ప్రస్తుత తరుణానికి సంబంధించిన శాఖల అధికారులతో మాత్రమే సమీక్ష సమావేశం నిర్వహించ వల్సిందిగా ఇన్చార్జి మంత్రి తెలియజేశారని జిల్లా రెవెన్యూ అధికారి జె. ఉదయ భాస్కరరావు తెలిపారు. సమావేశం జరుగుతుందని సంబంధిత అధికారులకు ముందుగానే తెలియజేయడం జరిగిందని, ఆయా శాఖల అధికారులు అందరూ సమావేశము నకు హాజరయ్యారన్నారు. ఒక అధికారి రాలేకపోవడంతో వారికి ఫోన్ చేసి చెప్పామన్నారు. సమీక్షా సమావేశానికి ప్రోటోకాల్ పక్కాగా పటించామని డీ ఆర్ ఓ ఉదయ భాస్కర రావు తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఒక విద్యార్థి డిబార్

వెంకటాచలం,డిసెంబర్ 18,ప్రభాతవార్త: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలో ఈ రోజు మధ్యాహ్నం జరిగిన ఒకటోవ సెమిస్టరు పరీక్షలో మొత్తం 8177 మంది విద్యార్థులకు గాను 7486 మంది హాజరు కాగా 691 మంది గైర్హాజరు అయ్యారు.పరీక్ష కేంద్రం శ్రీ వేమా డిగ్రీ కళాశాల నాయుడుపేట నందు ఒక విద్యార్థి డీబార్ అయినారు అని పరీక్షల నిర్వాహణాధికారి డా.ఆర్.మధుమతి గారు తెలిపారు.

వ్యవసాయ సంచాలకులు సుజాత విచక్షణా రహితంగా పురుగుమందులు వాడరాదు

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : రైతులు సాగు ఖర్చులు తగ్గించి దిగుబడి పెంచుకునేలా దృష్టి పెట్టాలని విచక్షణారహితంగా పురుగుమందులు వాడకూడదని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరు మండలం పాటూరు, చెర్లోపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం చలి వాతావరణం ఉండడం వలన బీపీటీ 5204 రకానికి జింక్ లోపం ఎక్కువగా ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు ఎరువులు వేసే వారు ప్రస్తుతం వేయకుండా జింక్ లోపాన్ని సవరించుకుని తర్వాత మాత్రమే ఎరువులు వేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కాంప్లెక్స్ ఎరువులను ఎక్కువగా వేయరాదన్నారు. కొజపులు నివారణకు పొలంలో నీరు తక్కువగా ఉంచి పిప్రోనిల్ 6 కిలోలు ఎకరాకు వాడుకోవాలని సూచించారు. పొలంలో ఆకుముడత, మోమిపిప్పి ఉన్నట్లయితే వేపనూనె 5 మి.లీ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకాన్ని రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు మౌనిక, నారాయణ, రైతులు ఉన్నారు.

డాక్యుమెంట్లు పోయినవి

నా క్లైంట్ అయిన **మేకల వంశీకృష్ణ**, తండ్రి **సుధాకర్**, కుడితిపాళెం గ్రామం, ఇందుకూరుపేట మండలం, SPSR నెల్లూరు జిల్లా నా క్లయింట్‌కు సంబంధించిన ఒరిజినల్ రిజిష్టర్ **డాక్యుమెంట్లు నెంబర్లు 2039 / 2024, 2040 / 2024 తేది: 07-12-2024** న కుడితిపాళెం గ్రామం నుండి ఇందుకూరుపేట మండలము ఆఫీసు దగ్గర జెరాక్స్ షాపుకు తీసుకొని పోవుచుండగా మార్గ మధ్యలో జారిపడిపోయినవి. ఈ ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంట్లు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

పి.సురేష్ కుమార్, ఎం.బి.ఎ., ఎల్.ఎల్.బి., అడ్వకేట్, ఎ.సి.నగర్, నెల్లూరు.
సెల్: **96662 82639**

రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ఆయా గ్రామాల్లోని రైతులు రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే ఈ సదస్సు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నిర్మలానంద బాబా తెలిపారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఈ గ్రామంలో ఇనామ్ భూములకు సంబంధించి కొంత సమస్య ఉందని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వాటిని పూర్తిస్థాయిలో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్. శ్రీవాణి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాకేష్, సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

పాడి రైతులు పశువులకు తప్పక ఇన్సూరెన్స్ చేసుకోవాలి

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : కోవూరు మండలం పడుగుపాడు జాతీయ రహదారి ప్రాంతంలో బుధవారం గుర్తు తెలియని వాహనం డీకొని రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ నేపథ్యంలో అటుగా వెళ్తున్న 1962 వెహికల్ ప్రోగ్రామ్ మేనేజర్ ఈ పరిస్థితిని గమనించి వెంటనే 1962కు సమాచారం ఇచ్చి ఆ పశువులకు వైద్య సేవలు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా తీవ్రంగా గాయపడిన రెండు పశువుల్లో ఒక పశుకు అక్కడికక్కడే మృతిచెందగా ఒక పశువుకు మాత్రం పశు వైద్యులు లక్ష్మీప్రసన్న, షబానాలు వైద్య పరీక్షలు నిర్వహించి సురక్షితంగా పాడి రైతు ఇంటికి పంపేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పాడి రైతులు తప్పనిసరిగా తమ పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు తగు నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ గేదెకు సంబంధించిన రైతు వరమ్మ ఎటువంటి ఇన్సూరెన్స్ చేయకపోవడంతో ఆమెకు తీవ్రనష్టం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పాడి రైతులు తప్పక ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు.

ఎల్ హెచ్ ఎం ఎస్ సేవలు వినియోగించుకోండి

జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ - నగరంలో విస్తృత ప్రచారం

నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 18, ప్రభాతవార్త : రాబోయే క్రిస్మస్, సంక్రాంతి సెలవుల్లో తాళం వేసిన ఇళ్లలో ఎటువంటి దొంగతనాలు జరగకుండా నివారించేందుకు ప్రజలు ఎల్ హెచ్ ఎం ఎస్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ జీ. కృష్ణ కాంత్ కోరారు. ఎల్ హెచ్ ఎం ఎస్ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎస్పీ ఆదేశాలతో నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది ఆటోల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. సెలవుల సందర్భంగా దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఊరెళ్లిన సమాచారం సోషియల్ మీడియాలో పోస్ట్ చేయకుండా ఉండటమే మంచిదని సూచించారు. దొంగతనాల చేధనకు ప్రతి ఇంటికి రక్ష ఎల్ హెచ్ ఎం ఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) సేవలు ఇస్తున్నామని ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ద్వారా లేదా 9440796383, 9392903413 నంబర్ లకు కానీ, స్థానిక పోలీసులను కానీ సంప్రదించి ఈ సేవలు ఉచితంగా వినియోగించుకోవచ్చని స్పష్టంచేశారు. దొంగతనాల నిరోధానికి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న ఈ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా సిబ్బందిని ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు. స్థానిక పోలీసుల కెమెరాలను ఉచితంగా అమర

దేవాదాయశాఖ మంత్రి ఆనంను కలిసిన గంగపట్నం చంద్రశేఖరయ్య

సంగం డిసెంబర్ 18 ప్రభాతవార్త సంగం మండలం పడమటిపాళెం నీటి సంఘం అధ్యక్షులు గంగపట్నం చంద్రశేఖరయ్య,సంగం పంపింగ్ స్కీమ్ అధ్యక్షులు షేక్ బాబు,టిడిపినాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందజేశారు. మంత్రి సాగునీటి సంఘం అధ్యక్షులందర్ని అభినందించారు.

రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా జరగాలి



కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ఎండీయూ డ్రైవర్లు ప్రభుత్వం నిర్దేశించిన వేళలను తప్పక పాటించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన డీలర్లు, ఎండీయూ డ్రైవర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేది ఉదయం 6 గంటలకే సరుకుల పంపిణీ ప్రారంభం కావాలన్నారు. అదే విధంగా కొంతమంది కార్డుదారులను చులకనగా చూస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి వారి పట్ల ఉపేక్షించేది లేదన్నారు. పోర్టబులిటీ మండలంలోని ఒక షాపుకు.. ఒక షాపుకు కాదని, వేరే ప్రాంతం నుంచి వచ్చిన వారికే ఇవ్వాలన్నారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో కందిపప్పు అన్ని షాపులకు సక్రమంగా ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని, దీనిని సరిదిద్దుకోవాలన్నారు. ఇటువంటి సమావేశాలు నిర్వహించే సమయంలో తప్పనిసరిగా డీలర్లు, ఎండీయూ వాహన డ్రైవర్లు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ పలు సూచనలు చేశారు.డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే నాసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌రాకేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, డీలర్స్ అసోసియేషన్ నాయకుడు కృష్ణారెడ్డి,ఉన్నారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించేందుకే సదస్సులు

కోవూరు, డిసెంబరు 18 ప్రభాతవార్త : ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించేందుకే టెక్ సాక్షమ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేయడం జరిగిందని, దీనిని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం టెక్ సాక్షమ్ ఐఆర్ 4.0 ఫౌండేషన్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సు ద్వారా విద్యార్థులు ఇండస్ట్రీ రెవల్యూషన్ 4.0కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానాన్ని పొందవచ్చున్నారు. అదేవిధంగా కృత్రిమ మేదస్సు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డేటా అనలెటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలను అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ప్రస్తుతం పరిశ్రమల్లో అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం కూడా కలుగుతుందన్నారు. ఏఐసీటీఈ ఎడ్యునెట్ ఫౌండేషన్ సంస్థ ద్వారా ప్రత్యేక శిక్షణ కల్పిస్తున్నామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సూబ్బరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌లుగా అంకిత్ , దీక్షిత్, మేథినిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి. గాయత్రి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ యు పెంచలయ్య, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ టి. రవికుమార్, సీఎస్‌డీఎస్ విభాగాధిపతి టి. సాయిప్రసాద్‌రెడ్డి, ఐఐఎంఎల్ విభాగాధిపతి పి. నాగేంద్ర కుమార్, కళాశాల అకడమిక్ డీన్ డాక్టర్ ఆర్. రజని, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

నీటి వనరులను కాపాడుకుందాం

వరికుంటపాడు,డిసెంబర్ 18,ప్రభాతవార్త : నీటి వనరులను కాపాడుకొని,భావి తరాలకు నీరు అందేలా చూద్దామని జెఎస్ఎ కేంద్ర బృందం సభ్యుడు,ఐఆర్ఎస్ అధికారి,ఎగ్జిక్యూటివ్ జాయింట్ సెక్రటరి లెవల్ డైరెక్టర్ సచీంద్రకుమార్ పట్నాయక్ అన్నారు.బుధవారం మండలంలోని రామాపురం గ్రామంలో ఉపాధి హామి పథకంలో నీటి వనరుల రక్షణ పనులను ఆయన పరిశీలించారు.అలాగే హార్టికల్చర్‌లో భాగంగా సాగులో ఉన్న బత్తాయి,జామ తోటలను పరిశీలించి, అధికారులను అభినందించారు.నీటి కుంటలలో నీరు ఎంతకాలంనిల్వ ఉంటాయి,ఏఏ అవసరాలకు వినియోగిస్తారో అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట సీనియర్ సైంటిస్ట్‌డి.లక్ష్మినారాయణ,డ్వామా పిడిగంగాభవాని,పిఎలోకేష్ ,ఎపిడి శంకర్ నాయక్,ఈఓపిఆర్‌డి నాగూర్‌వలి,ఎపిఓ అజంఖాన్,టిఎలుఏడు కొండలు,మూర్తి,హరి,చెన్నయ్య,ఎఫ్ఎ నాగమణి,ఉపాధికూలీలు,రైతులుపాల్గొన్నారు.

కరెంటు ఆదాచేద్దాం... భావితరాలకు భరోసానిద్దాం...

కావలి, డిసెంబర్18 ప్రభాతవార్త కరెంటు ఆదాచేద్దాం... భావితరాలకు భరోసా నిద్దా మంటూ కావలి విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీ య ఇంధనపొదుపు వారోత్స వాల ర్యాలీ జరిగింది. ఈ ర్యా లీ పట్టణ జాతీయ రహదారిపై, పురవీధుల్లో సాగింది. ప్లెకార్డులు పట్టుకుని విద్యుత్‌శాఖ ఉద్యోగులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఇ.ఇ కెయస్ బెనర్జీ, డిప్యూటి ఇంజనీర్ ఏ.రవికుమార్‌రెడ్డి, టి.కృష్ణమోహన్‌బాబు, ఎం.రవికుమార్, ఎఇలు వై.వసంతరావు, సిహెచ్ శ్రీనివాసులురెడ్డి, దగదర్తి, వింజమూరు, అల్లూరు, కావలిరూరల్ ఎఇలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగన్నపాలెం పంచాయతీకి రూ.2.80లక్షలు ఆదాయం

సైదాపురం, డిసెంబర్ 18, ప్రభాతవార్త మండల పరిధిలోని లింగన్నపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న చెరువుకు ఈవోఆర్డీ జిలాని బేగ్ ఆధ్వర్యంలో చెరువులో చేపలు పెంచేందుకు బుధవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు రూ.2.80లక్షలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. పంచాయతీకి వచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని గ్రామ సర్పంచ్ నరసరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధుజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన



వింజమూరు,డిసెంబర్18,ప్రభాతవార్త: వింజమూరులోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూసదస్సుకు విశేష స్పందన లభించింది. పలువురు భూసమస్యలపై అర్జీలతో బారులు తీరారు. ఈకార్యక్రమానికి కావలి ఆర్‌డిఒ వంశీకృష్ణ హాజరయ్యారు. ఈసదస్సులో 189అర్జీలు వివిధ సమస్యలపై వచ్చాయన్నారు. భూముల కోసం అధికశాతం మంది అర్జీలు అందించారు. ఈసందర్భంగా ఆర్‌డిఒ వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూసమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సును నిర్వహిస్తుందన్నారు. మీ భూమి-మీ హక్కు కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రతిసమస్య పరిష్కారానికి ఈ సదస్సు జరు గుతుందన్నారు. ప్రతిచోట పొలాలకు వెళ్ళేందుకు ఉన్న దారులను ఆక్రమిం చారని, నివాసాలున్నచోట పేడదిబ్బలతో సవాసం చేయాల్సి వస్తుందని, పాస్ బుక్‌ల కొరకు , సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయా లని, భూమిని సర్వే చేయాలని వినతులు వచ్చాయన్నారు. సదస్సుకు వచ్చిన అర్జీలను 90రోజుల్లో పరిష్కరిస్తారన్నారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ హమీద్, సర్పంచ్ సుజన,టిడిపి మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి ,కార్య నిర్వాహకకార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, మండల మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, ఊటుకూరు మాజీ ఎంపిటిసి సభ్యులు గురజాల వెంకటరమణయ్య , పట్టణ అధ్యక్షుడు కోడూరు నాగిరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు మంచాల శ్రీని వాసులునాయుడు, మాజీ మార్కెట్‌కమిటీ డైరెక్టర్ గురజాల వాసునాయుడు, నాయకులు పాములపాటి మాల్యాద్రి, పంచాయతీ కార్యదర్శి వి.శివకుమార్ , ఆర్ఐ పి.ఇమ్రాన్‌ఖాన్, రెవెన్యూ సిబ్బంది, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్ల ఆక్రమణలు తొలగింపు

నెల్లూరు కార్పొరేషన్,డిసెంబర్ 18,ప్రభాతవార్త: నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశాల మేరకు స్థానిక 37 వ డివిజన్ రామ్ నగర్ మూడవ వీధి లోని ఆక్రమణలను బుధవారం తొలగించారు. రోడ్డును ఆక్రమిస్తూ ఇంటి ప్రహరీ గోడ నిర్మాణం జరుగుతున్నట్లు గతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికులు కమిషనర్ కు ఫిర్యాదు చేసి ఉన్నారు. అందుకు స్పందించిన కమిషనర్ నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బందిని ఆదేశించారు. నోటీసులు జారీ చేసి సర్వే రిపోర్ట్ పరిశీలించిన అనంతరం అక్రమ నిర్మాణంగా నిర్ధారిస్తూ ప్రహరీ గోడ నిర్మాణాన్ని జెసిబి ల సహాయంతో కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు శాఖ సిబ్బంది పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపి, ఆక్రమణల తొలగింపు బృందాలు పాల్గొన్నారు.

జనవాణిని సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు,డిసెంబరు18 ప్రభాతవార్త-విద్య తమ పార్టీ అధినేత,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ ఆశయాల్లో భాగంగా పుట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదకి జనవాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. బుధవారం నగరంలోని స్థానిక గోమతినగర్‌లోని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యాయంలో జనవాణిని నిర్వహించి ప్రజలనుండి విజ్ఞప్తులను స్వీకరించారు. మాట్లాడుతు జనవాణిలో తాము స్వీకరించిన అరీ జ్జలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెల్లి సత్వరం పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఇప్పటికే తమకు అందిన విజ్ఞప్తులను పరిష్కరించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యులు నూనెమల్లిఖార్జునయాదవ్, గునుకుల కిషోర్, నాయకులు కృష్ణారెడ్డి, కార్యాలయ ఇన్‌చార్జ్ జమీర్, తదితరులు పాల్గొన్నారు.

అనుకూలంగా హెల్త్ అసిస్టెంట్లకు సుప్రీంకోర్టు తీర్పు

నెల్లూరు, డిసెంబర్ 18, ప్రభాతవార్త-వైద్యం ఇటీవల వైద్యశాలలో తొలగించిన హెల్త్ అసిస్టెట్లను తిరిగి విధుల్లోకి తీసుకునేలా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషకరమని ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకరరావు తెలిపారు. బుధవారం సంతపేటలోని ఆ సంస్థ కార్యా లయంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యుల అత్య వసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడు తూ గత 20 ఏళ్లకు పైగా వైద్యశాలలో హెల్త్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న వారి లో నెల్లూరు జిల్లా నుంచి 54 మందిని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 1200మందికి పైగా హెల్త్ అసిస్టెంట్లను తెలంగాణ కోర్టు తీర్పుతో ఇటీవల తొలగించడం జరిగిందన్నారు. దీంతో వారంత మానసిక వేదనకు గురయ్యారన్నారు. ఒక హెల్త్ అసిస్టెంట్ మానసిక వేదనతో గుండె పోటుకు గురై మృతి చెందాడన్నారు. అయితే ఇలాంటి వారందరికి న్యాయం చేసేలా సుప్రీం కోర్టు నేడు తీర్పు ఇవ్వ డం జరిగిందన్నారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం 20 రోజుల్లో తొలగించిన ప్రతి ఒక్కరిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. జిల్లా డీఎంహెచ్ఓ సత్వరమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సెక్రటరీ కమల్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో ఘనంగా ప్రెషర్స్‌డే వేడుకలు

ఉదయగిరి, డిసెంబర్ 18, ప్రభాతవార్త మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాల- ఉదయగిరి నందు నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలు కుతూ సీనియర్ విద్యార్థులు ప్రెషర్స్‌డే వేడుక మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి అధ్యక్షత వహించి నూతనంగా చేరిన విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యవసాయ కోర్సు నందు మీ ఊహలను పునర్మించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని సీనియర్ విద్యార్థుల నుంచి సలహాలు తీసుకోవాలని, సీనియర్ విద్యార్థులతో స్నేహంగా మెలగాలని సూచించాఉ. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు పాల్గొని మాట్లాడుతూ విద్యాఉరంగా, సామాజికపరంగా మానసికంగాను అభివృద్ధి చెందాలని ఈ వ్యవసాయ కళాశాలలో ఆయా కోర్సులతో పాటు సాంప్రదాయకంగా నడుచుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగం గురించి మాట్లాడుతూ భారతదేశానికి వ్యవసాయం వెన్నుముక లాంటిదని, కోవిడ్ సమయంలో అన్ని రంగాలు మూతఉడినను వ్యవసాయంలో రైతులు కష్టపడ్డారని, ఈ దేశానికి ఆహార అభివృద్ధికి తోడ్పడి ఆ సమయంలో అందరికి ఆహారాన్ని అందించడంలో ముఖ్య పాత్ర పోషించారని అలాంటి వ్యవసాయ కోర్సులు అభ్యసిస్తున్న మీరు అదృష్టవంతులని అంతే కాకుండా దేశ భవిష్యత్తును మార్చే శక్తి విద్యార్థులేనని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా జి.శివన్నారాయణ ప్రాజెక్టు డైరక్టర్, ఆత్మ పి.చెన్నారెడ్డి, అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ కే.సుభద్ర, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉదయగిరి ఎస్సై ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు. ఫ్రెషర్స్‌డే సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ, మోడ్రన్ దుస్తుల్లో హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన నాటకాలు, ఆచార నృత్యాలు, ఆటలు ఆహుతులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు తనూజ, శృతి, రశ్మిత, వంశీకృష్ణ, సూర్య, రాహుల్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ రఘునాథరెడ్డి, డాక్టర్ సునీత, డాక్టర్ జి.రమేష్, డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ కిషన్ తేజ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కమల ప్రియ, బోధనేతర సిబ్బంది, సీనియర్ విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జనసేన నీటి సంఘాల అధ్యక్షులకు సన్మానం



నెల్లూరు,డిసెంబరు18 ప్రభాతవార్త-విద్య ఇటీవల నిర్వహించిన నీటి సంఘాల అధ్యక్షుల ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున విజయం సాధించిన కోవూరు , సర్వేపల్లిలోని విజేతలకు బుధవారం నగరంలోని స్థానిక జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యాయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు నీటి వనరుల సంరక్షణ అభివృద్ధి కోసం గెలిచిన సభ్యులు వారి పదవులకు పూర్తి న్యాయం చేయా ్యలని కోరారు. తెలిచిన పార్టీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం గెలుపొందిన వారిని శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లిఖార్జున యాదవ్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, ఏటూరి రవికుమార్, మురళీరెడ్డి, భవాని నాయుడు, సురేష్, వెంకటరమణమ్మ, నందిని, కస్తూరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భావి తరాలకు మంచి పర్యవరణమే ప్రభుత్వ లక్ష్యం

..ఎపి ఎన్విరాన్‌మెంట్ ఛైర్మన్ పి.దినేష్ రెడ్డి

బోజ్జనపల్లి(రావూరు),డిసెంబరు18ప్రభాతవార్త భావి తరాలకు మంచి పర్యవరణం అందించడమే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్ రెడ్డి తెలిపారు. బుదవారం రావూరు మండలంలోని బోజ్జనపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో ఏర్పాటు చేసి వున్న కోస్టల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ను ఆయన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వ్యర్థాలను ఎలా ట్రీట్‌మెంట్ చేసి పర్యావరణం దెబ్బతినకుండా చేస్తారు అన్న విషయాలను తెలుసుకున్నారు. అనంతరం దినేష్ రెడ్డి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణతో కలసి పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌లు పర్యావరణం కాపాడంఒక ఛాలేంజ్‌గా తీసుకోని అందుకు తగ్గట్టుగా ఆలోచనలు చేస్తున్నారన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అనేక పరిశ్రమల నుండి వచ్చిన వ్యర్థాలను సేకరించి పర్యావరణం దెబ్బతినకుండా వాటికి ఇక్కడ ట్రీట్‌మెంట్ చేయడం జరుగుతుందని వివరించారు. టి.ఎస్.టీ.ఎఫ్,ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారామంచి వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ భాద్యతగా తీసుకోందన్నారు. ఇలాంటి ప్లాంట్స్ మరిన్ని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చి పర్యావరణం కాపాడుతామని తెలిపారు. ఈయన వెంట పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి,నాయకులు చెన్ను అశోక్ రెడ్డి,రావూరు మండల టిడిపి కన్వినర్ దందోలు వెంకటేశ్వర రెడ్డి,నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వర రెడ్డి,కె.వి.కె ప్రసాద్,మండల కోఆప్షన్ సయ్యద్,టిడిపి రాష్ట్ర ఎస్‌సీ సెల్ నాయకుడు పచ్చిగళ్ళ రత్నం,దందోలు హరికృష్ణా రెడ్డి,కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బ్రహ్మయ్య,హెచ్ఆర్ ఆమర్నాథ్ రెడ్డి, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి అశోక్ కుమార్,ఎపిఎంసిఎల్ జియం వెంకటేశ్వర్లు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు వున్నారు.

లిక్కర్ స్టోర్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 18, ప్రభాతవార్త నూతన ఎక్సైజ్ విధానంలో భాగంగా నెల్లూరు నగరంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఎ. శ్రీనివాసులు నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రీమియం లిక్కర్ స్టోర్స్‌ను మంజూరు చేయగా వాటిలో నెల్లూరు జిల్లాకు ఒకటి కేటాయించినట్లు తెలిపారు. స్టోర్ లైసెన్సు వ్యవధి ఐదు సంవత్సరాలన్నారు. స్టోర్ ఏర్పాటుకు ఆసక్తిగల వారు ఏపిఎస్‌బిసిఎల్.ఏపి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. నాన్‌రీఫండ్ రుసుం రూ 15 లక్షలకు డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 31వ తేది సాయంత్రం ఐదుగంటల లోపు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

కృష్ణారెడ్డి తల్లి చిత్రపటానికి నివాళులర్పించిన చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు రూరల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త నెల్లూరు సిటీ 14 డివిజన్ పద్మావతి నగర్లో పెద్దిరెడ్డి కృష్ణారెడ్డి మాతృమూర్తి పుష్పమ్మ వర్ధంతికి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి కృష్ణా రెడ్డిని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరామర్శించారు. ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వారి నివాసానికి నెల్లూరు నగర ఇంచార్జ్ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డితో పాటు కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, నీలి రాఘవ రావు, 16 వ డివిజన్ వైసీపీ అధ్యక్షులు సగిలి జయరామిరెడ్డి మరియు స్థానిక వైసీపీ నాయకులు ప్రసాద్ రెడ్డి, దశరథ రామిరెడ్డి, లక్ష్మి రెడ్డి, శరత్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

తుపిలి సుధాకర్ రెడ్డి పరామర్శించిన చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు రూరల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త 16 వ డివిజన్ కు చెందిన వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తూపిల్లి సుధాకర్ నివాసానికి డివిజన్ అధ్యక్షులు సగిలి జయరామిరెడ్డి ఇతర స్థానిక పెద్దలతో కలిసి వెళ్లి సుధాకర్ రెడ్డి తల్లి తుపిలి వనమ్మ చిత్రపటానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నివాళులర్పించారు. వారి తల్లి తుపిలి వనమ్మ చిత్రపటానికి నివాళులర్పించి భగవంతుడు వనమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రార్థించారు వీరితో వారికి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వెంట స్థానిక నాయకులు సురేంద్ర రెడ్డి, శేషా రెడ్డి,శశిధర్ రెడ్డి, సురేష్ రెడ్డి, శ్రీహరి రెడ్డి, రాజ గోపాల్ రెడ్డి, నంద రెడ్డి,మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీ వేమిరెడ్డితో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులు

నెల్లూరు రూరల్, డిసెంబర్ 18, ప్రభాతవార్త నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికైన తెలుగు అధికారులు ప్రత్యేకంగా కలిశారు. ఢిల్లీలోని పార్లమెంట్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొంటున్నారు. శిక్షణలో భాగంగా ఎంపీ వేమిరెడ్డిని కలిసిన సదరు అధికారులు. ఆయనతో భేటీ అయి మాట్లాడారు. పార్లమెంట్‌కు సంబంధించి విధివిధానాలు, క్రమశిక్షణ, ఇతర అంశాలపై వారికి దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ లో తన అనుభవాలను సదరు అధికారులకు ఆయన ప్రత్యేకంగా తెలిపారు. తన విలువైన సలహాలు, సూచనలను అందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి వారు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఎంతో విలువైన సూచనలు సలహాలు అందించిన ఎంపీ వేమిరెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా సంకటహర చతుర్థీ పూజలు

కోవూరు, డిసెంబరు 18ప్రభాతవార్త : కోవూరులోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో వెలసి ఉన్న శ్రీ వినా యకునికి బుధవారం సంకటహర చతుర్థీపర్వదినాన్ని పురస్కరించుకుని స్వా మి వారికి అభిషేక పూజలను ఆల య ప్రధాన అర్చ కులు నాగరాజాచా ర్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అ త్యంత వైభ